ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



యువనేతకు నీరాజనం



● మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు, జనం

చిత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో భాగంగా ఇచ్చిన తొలి హామీ నెరవేర్చడానికి యువనేత నారా లోకేశ్ గురువారం రాత్రి 11.20 గంటలకు బంగారుపాళ్యం చేరుకున్నారు. ఆయనకు తిరుపతి విమానాశ్రయం నుంచి అడుగడుగునా టీడీపీ శ్రేణులు, జనం పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. రాత్రి 11 గంటల సమయంలోనూ చిత్తూరు శివార్లలో ఇరువారం బైపాస్ రోడ్డుపైకి వచ్చి మంత్రి లోకేశ్‌కి స్వాగతం పలికారు. విమానాశ్రయంలో తిరుపతి జిల్లా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. నేంద్రగుంట వద్ద చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో. చిత్తూరు ఇరువారం బైపాస్ వద్ద చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు భారీఎత్తున స్వాగతం పలికారు. బంగారుపాళ్యంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడితోపాటు పూతలపట్టు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలతోపాటు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు ఉన్నారు.



చిత్తూరు ఇరువారం బైపాస్‌లో మంత్రికి ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు, జనం



తిరుపతి విమానాశ్రయంలో నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, థామస్



బంగారుపాళ్యంలో రాత్రి బస వద్ద లోకేశ్ మాటామంతీ

నేడే తొలి హామీ అమలు



ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యంత్రాలు, బెడ్లు

● బంగారుపాళ్యంలో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించనున్న మంత్రి నారా లోకేశ్

చిత్తూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ గత ఏడాది చేపట్టిన యువగళం పాదయాత్ర తొలి హామీని శుక్రవారం అమలు చేయనున్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు తొలి అడుగు మన జిల్లాలోనే పడింది. వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఆటంకాలను అధిగమించి 2023 జనవరి 27వ తేదీన కుప్పం నుంచి యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా యువనేత ప్రతి వంద కిలోమీటర్లకు శిలాఫలకం ఏర్పాటుచేసి ఓ హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు, శాశ్వత పరిష్కారాలే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు చోట హామీలిచ్చారు. వాటిలో తొలి హామీ బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు. గత ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బంగారుపాళ్యంలో వంద కిలోమీటర్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పూతలపట్టు నియోజకవర్గంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేసుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక టీడీపీ నాయకులు అప్పట్లో లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పడిన తొలి వంద రోజుల్లోనే తొలి హామీని అమలు చేస్తున్నారు.

రూ.2.50 కోట్లతో యంత్రాల ఏర్పాటు

మంత్రి అభ్యర్థనతో కేంద్రం ప్రభుత్వం పీఎం నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ కింద రూ.50 లక్షల విలువ చేసే ఐదు యంత్రాలను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించింది. ఇవి ఈ మధ్య ఆస్పత్రికి చేరుకున్నాయి. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో వీటిని అమర్చారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సుమారు 30 మంది ఇప్పటికే డయాలసిస్ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

విషాదం

● విద్యుదాఘాతంతో తాతామనవడు దుర్మరణం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 19: విద్యుదాఘాతంతో తాతామనవడు దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన బంగారుపాళ్యం మండలంలోని గుండ్లకట్టమంచి దళితవాడలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుండ్లకట్టమంచి దళితవాడకు చెందిన నాగయ్య తన ఇంట్లోని ఇనుప ఊయలలో ఊగుతున్నాడు. ఈ సమయంలో పక్కనే స్విచ్ బాక్స్‌కు వేలాడుతున్న విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన మనవడు రాజ్‌కుమార్ తన తాతను కాపాడబోయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.





నాగయ్య - రాజ్‌కుమార్ మృతదేహాలు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, సెప్టెంబరు 19: కళియంబాకం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య విద్యార్థులకు విద్యాసామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదు వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వ చేసిన నలుగురిపై కేసు


స్వాధీనం చేసుకున్న వ్యాన్

గంగాధర నెల్లూరు, సెప్టెంబరు 19: పాచిగుంట పంచాయతీ గొల్లపల్లెలోని కోళ్ళఫారంలో తమిళనాడు బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందిన సూరి, పుల్లూరు క్రాస్‌కు చెందిన మురుగన్, గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ గొల్లపల్లెకు చెందిన లోకనాథరెడ్డి, తమిళనాడుకు చెందిన అశోక్‌కుమార్‌లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి 41నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. వ్యాన్‌ని పోలీ స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీఐ పేర్కొన్నారు.

కాలేజీ ఆవరణ వద్ద ఆక్రమణల తొలగింపునకు చర్యలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 19: పచ్చికాపల్లం జడ్పీ జూనియర్ కళాశాల ప్రహరీ ముందుభాగంలో చిల్లర దుకాణాల ఆక్రమణలను తొలగిస్తామని డీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు చెంగ్రలాయులు వినతి మేరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టామన్నారు. గురువారం ఆక్రమణదారులూ స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించామన్నారు.

గ్రామీణ బ్యాంకులో అధిక వడ్డీ

గుడిపాల, సెప్టెంబరు 19: గుడిపాల గ్రామీణ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నట్లు బ్యాంకు తిరుపతి రీజనల్ మేనేజర్ రవి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రజినీకాంత్‌లు చెప్పారు. తమ బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్ చేసేవారికి 7.75శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వంశీ, బ్యాంకు మిత్ర రవి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కారాదు : సీఐ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మహేశ్వర్

నగరి,సెప్టెంబరు19: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కారాదని సీఐ మహేశ్వర్ కోరారు. స్థానిక సూర్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, మహిళారక్షణ, డ్రగ్స్‌అడిక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పెరిగిన సాంకేతికపరిజ్ఞానంలో మంచిచెడులను గ్రహించి సన్మార్గంలో ప్రయాణించాలని సూచించారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

నగరి,సెప్టెంబరు19: నాగరాజకుప్పం సమీపంలోని జగనన్న కాలనీ వెనుక సారా విక్రయిస్తున్న శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి పట్టుకున్నామన్నారు. 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డీసీసీబీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలకు సన్మానం



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 19: డీసీసీబీ ఎంప్లాయిస్ యూనియన్‌కు కొత్త అధ్యక్షుడిగా రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా గంగిరెడ్డిలు ఎన్నికైన సందర్భంగా గురువారం సంఘ నాయకులు సన్మానించారు. సింగిల్ విండో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బి.రమేష్, జాయింట్ సెక్రటరీ రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీధర్, యూనియన్ కమిటీ సభ్యుడు మురుగన్‌లు పూలమాలలు వేసి, శాలువలు కప్పి సన్మానించారు.

సత్యసాయి సంస్థాన్‌లో ఘనంగా మాస మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 19: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం మాస మహిళాదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సమితి నిర్వాహకులు, భక్తులు స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు, బాలింతలరే వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. సత్యసాయి సేవాసమితి, బాలవికాష్, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.10 లక్షల విరాళం




ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చిత్తూరుకు చెందిన బీఎం.రెడ్డి గురువారం రూ.1,10,000, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50,000 విరాళంగా అందించారు. దాతను ఆలయ సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

విజయవాడ వరద బాధితులకు విద్యార్థుల విరాళాల సేకరణ

నగరి,సెప్టెంబరు19: మండల పరిధిలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ,ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళం రూ10,500 విజయవాడలోని వరద భాదితులకు పంపిస్తున్నట్లు ప్రదానోపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు.

ఉన్నత శిఖరాలకు క్రమశిక్షణ మార్గం

పాలసముద్రం, సెప్టెంబరు 19: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖారాలకు చేరుకోవచ్చునని అజిత్ గురూజి పేర్కొన్నారు. గురువారం ఎస్‌ఆర్‌కండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మానవీయ విలువులపై అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రబోదించారు. ఉత్తమ విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. రాష్ట్ర టీడీపి కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, ప్రధానోపాధ్యాయుడు రఘు, లింగమూర్తి, శాంతకుమారి పాల్గొన్నారు.













పలమనేరు
కుప్పం/పుంగనూరు

వైభవంగా గంగమాంబ కుంభాభిషేక వేడుకలు



శాంతిపురం, సెప్టెంబర్ 19 : మండల పరిధిలోని కర్లగట్ట పంచాయతీ చీమనపల్లెలో నూతనంగా వెలిసిన ప్రసన్న గంగమాంబ ఆలయ కుంభాభిషేక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం కలశ స్థాపన చేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. గురువారం అమ్మవారి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

పలమనేరు, సెప్టెంబరు19 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌సీసీలో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో 115 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 35 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. దేహదారుఢ్య పరీక్షలు, పరుగుపందెం, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జిపై పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన సుబేదార్ మహేష్, హవల్దార్లు మదన్, సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ బాలాజీ పాల్గొన్నారు.

క్రీడాపోటీల ప్రారంభం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 19 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి క్రీడాపోటీలను ఎంఈవో సుబ్రమణ్యం ప్రారంభించారు. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్‌కు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపికచేశారు. ఎస్ఎంసీ చైర్మన్ మణికంఠ, పాఠశాలల హెచ్ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ రూ.1.35 లక్షలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు19: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని నగిరివీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి మంగళవాయిద్యాల మధ్య తరలించారు. 12 రోజలపాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు లడ్డూను వేలం వేయగా రూ.1.35లక్షలతో టీడీపీ నాయకుడు ఆర్వీటీ బాబు దక్కించుకున్నాడు. స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. యువత రంగులు చల్లుకుంటూ గణపతి బొప్పా బోరియా అంటూ పట్టణ సమీపంలోని పాములకుంట వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కారు అద్దాల ధ్వంసంపై ఫిర్యాదు

పుంగనూరు, సెప్టెంబరు19: కారు అద్దాల పగల గొట్టారంటూ ఓ న్యాయవాది గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని నారప్పవీధికి చెందిన ఆర్వీ. షరత్ కుమార్ ఇంటి వద్ద నిలిపిన కారు అద్దాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

శాంతిపురం, సెప్టెంబర్ 19: శాంతిపురం మండలంలో విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం కొనసాగుతోంది. గురువారం శివరామపురం, తుమ్మిశి పంచాయతీ టీడీపీ నేతలు రూ.1,10,850లను మండల పార్టీ కార్యాలయంలో టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుకు అందజేశారు. శివరామపురం పంచాయతీ టీడీపీ నేతలు ఆ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వరద బాధితులకు విరాళాలు సేకరించారు. అలాగే నేతలు తన వంతుగా ఆర్థిక సాయం చేసి రూ.70,000లు పార్టీ అధ్యక్షుడికి చేర్చారు. అలాగే తుమ్మిశి పంచాయతీ నేతలు విరాళాలు సేకరించి రూ.40,850లను పార్టీ అధ్యక్షుడికి అందిచారు.

టీచర్ లేక మూతపడ్డ పాఠశాల

శాంతిపురం, సెప్టెంబర్ 19 : మండల పరిధిలోని చిన్న గాండ్లపల్లె ప్రాథమిక పాఠశాల మూడు రోజులుగా టీచర్ లేక మూతపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో సుమారు 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుడు వినోద్ మూడురోజుల క్రితం అనారోగ్యం కారణంగా సెలవు పెట్టారు. దీంతో పాఠశాలకు ఉపాధ్యాయుడు లేక మూతపడింది. విద్యార్థులు ఇళ్ళకే పరిమితం అయ్యారు.

ఎంబీబీఎస్ పరీక్షల్లో పీఈఎస్‌కు ఉత్తమ ర్యాంకులు

కుప్పం, సెప్టెంబరు 19: ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గురువారం విడుదల చేసిన ఎంబీబీఎస్ మొదటి ఏడాది పరీక్ష ఫలితాలలో కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. 150 మందిలో 136 మంది ఉత్తీర్ణులై 90.67 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 6 మంది డిస్టింక్షన్, 79 మంది ఫస్ట్ క్లాస్, 51 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులవడం కళాశాలకు గర్వకారణమన్నారు. జి.మాధవి 81.67 శాతం, డి.కళ్యాణి 79.11, డీవీ.తేజస్విని 78.78, ఎం.సుజిత్ రెడ్డి 77.33, ఉమేధ యెస్నీ 76.89, షేక్ షైస్తా 75.22 శాతం మార్కులతో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం

చౌడేపల్లె, సెప్టెంబర్19: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి టీడీపీ నాయకులు రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. గురువారం టీడీపీ నాయకుడు రవినాయుడు మాట్లాడుతూ గడ్డంవారిపల్లె పంచాయతీ పెద్దకంపల్లెకు చెందిన గంగులప్ప కుమారుడు రవి అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆతని కుటుం బం వ్యవసాయ కూలీలు కావడంతో మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు రవి నాయుడు కలసి ఆసుపత్రికి వెళ్లి రూ.లక్ష అందించారు.

యాళి వాహనంపై వరసిద్ధుడి విహారం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు, 19: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం వరసిద్ధుడు యాళి వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ఎ.నరసింహారెడ్డి కుమారులు, చినకాంపల్లెకు చెందిన పి.సుబ్బారెడ్డి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వర సిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను యాళి వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా, గురువారం మహానంది ఆలయం తరఫున ఈవో శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలను వరసిద్ధుడికి సమర్పించారు. ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టరు విఘ్నేష్ పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి విమానోత్సవం నిర్వహించనున్నారు. ఐరాలకు చెందిన కీర్తిశేషులు రామకృష్ణపిళ్ళై కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

ఆదరువు లేదు.. ఆదుకోండి

భర్త వైద్యానికి సాయం చేయమని ఓ మహిళ వేడుకోలు



అచేతనంగా పడుకొన్న కుమార్ వద్ద నిల్చున్న భార్య, కుమారుడు

పలమనేరు, సెప్టెంబరు19 : నెలరోజుల క్రితం ప్రమాదవశాత్తు పడిపోయిన తన భర్త అచేతనంగా ఇంటికే పరిమితమయ్యాడని, తన భర్తకు వైద్యం చేయించేందుకు తనకు ఎటువంటి ఆదరువు లేదని, కావున దాతలు స్పందించి తన భర్తకు వైద్యంచేయించి ఆదుకోవాలని ఓ మహిళ వేడుకుంటోంది. పలమనేరు మండలం నక్కపల్లికి చెందిన పాపయ్య కుమార్తె మంజులకు, దాసార్లపల్లికి చెందిన కుమార్‌తో ఆరేళ్లక్రితం పెద్దలు వివాహం జరిపించారు. వివాహానంతరం కుమార్ నక్కపల్లిలోనే స్థిరపడిపోయాడు. వీరికి ఒక కుమారుడు (5) ఉన్నాడు. ఇద్దరూ కూలిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో నెలరోజుల క్రితం ఇంటిముందు ఉన్న పునాదులపైకి ఎక్కిన కుమార్ ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఏం జరిగిందో తెలియదు గానీ అప్పటినుంచి అచేతనంగా వుండిపోయాడు. దీంతో కుమార్‌ను మంజుల గ్రామస్థుల సాయంతో తిరుపతికి తీసుకెళ్లి అక్కడ వైద్యులకు చూపించగా అక్కడి డాక్టర్లు పరిశీలించి కుమార్‌కు వెన్నుపూసలో నరం దెబ్బతిందని, పెద్ద ఆసుపత్రిలో చూపించాలని సూచించారు. దీంతో పెద్ద ఆసుపత్రుల్లో చూపించే ఆర్థిక స్థోమత లేక మంజుల తన భర్తను ఇంటికి తీసుకు వచ్చేసింది. పడక కూడా దిగలేని తన భర్తకు ఇంటి వద్దే వుండిపోయి సపర్యలు చేసుకొంటోంది. కూలికి వెళ్లితే గాని పూటగడవని వారి పరిస్థితి చూసి గ్రామస్థులు జాలి చూపిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఎవరు సాయం చేసే పరిస్థితులు గ్రామంలో లేవు.

దీంతో తన భర్తను ప్రభుత్వం, అధికారులు స్పందించి పెద్ద ఆసుపత్రిలో చికిత్సలు చేయించి తన భర్తను, తన కుటుంబాన్ని ఆదుకోవాలని మంజుల కోరుతోంది. దాతలు పలమనేరు స్టేట్ బ్యాంకులోని తన బ్యాంకు ఖాతా నం 62264459291 (సీఐఎఫ్ నం. 72125711859) నంబరుకు నగదు పంపాలని కోరుతోంది.

ఆర్ఎంపీల వైద్యంపై నిఘా కమిటీ

పలమనేరు, సెప్టెంబరు19 : పలమనేరులో గత నెల 26న ఆర్ఎంపీ క్లినిక్‌లో వైద్యం వికటించి విద్యార్థిని మృతి చెందిన విషయం విదితమే. దీనిపై పలమనేరులో ఆర్ఎంపీలు వైద్య నిబంధనలు పట్టించుకోకుండా చేస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఆగస్టు 29న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు, జిల్లా విస్తరణ అధికారి జయరాం, మెడికల్ ఆఫీసర్ నిరంజన్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్‌లు పలమనేరులో ప్రైవేటు క్లినిక్‌లను సందర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వారు ఇంజక్షన్లు వేయడం, మరికొందరు ఏకంగా క్లినిక్‌లో మందులు, ఇంజక్షన్లు నిలువ వుంచుకోవడం, మరికొందరు మందు చీటీలు రాసి ఇవ్వడాన్ని గుర్తించారు. వాస్తవానికి ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్సలు మాత్రమే చేసి తదుపరి చికిత్సలకోసం పేషెంట్లను ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాల్సి వుంది. అయితే ఇక్కడి ఆర్ఎంపీలు ఇందుకు విరుద్ధంగా నడుచుకొంటున్న విషయాన్ని గుర్తించిన అధికారుల బృందం ఆర్ఎంపీల ను హెచ్చరికలు కూడా చేసింది. ఓ ఆర్ఎంపీ క్లినిక్‌లో ఒక మహిళా పేషెంటుకు సూది వేస్తుండగా అధికారులు గుర్తించి ఆయనకు నోటీసులు కూడా ఇచ్చింది. అధికారులు ఆర్ఎంపీల క్లినిక్‌లను సందర్శిస్తున్న విషయాన్ని గుర్తించి కొందరు బీగాలు కూడా వేసుకొని వెళ్లిపోయారు. ఈ ఘటనలు జరిగి 15 రోజులు కూడా గడవక ముందే కొందరు మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు నిఘా విభాగాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. త్వరలోనే ఆర్ఎంపీల అక్రమ వైద్యం అడ్డుకట్ట వేసేందుకు పలమనేరు డీఎస్పీ, తహసీల్దార్, వైద్యాధికారి, సబ్‌యూనిట్ అధికారి, మున్సిపల్ కమిషనర్‌లచే ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యశాఖ సిబ్బంది తెలిపారు. పలమనేరులో దాదాపు 44 మంది ఆర్ఎంపీలు, పీఎంపీలు ఉన్నట్లు గుర్తించామని, ఈ కమిటీ ఏర్పాటు చేసిన వెంటనే సమావేశం నిర్వహించి ఆర్ఎంపీలు, పీఎంపీలకు నోటీసులు ఇస్తామని, అప్పటికీ వారిలో మార్పురాకుంటే వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

దారి కోసం పెద్దఉప్పరపల్లెవాసుల నిరసన





కాలనీ ఇళ్లకు అడ్డుగా గోతులు, రాళ్లు, నిరసన వ్యక్తం చేస్తున్న పెద్దఉప్పరపల్లె గ్రామస్తులు

సోమల, సెప్టెంబరు 19: సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీ ఇళ్లకు ఉన్న దారిని అడ్డుకోవడంతో బాధిత కుటుంబాలు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసింది. 30 మంది ఇళ్ల నిర్మాణాలు చేసి పలు కుటుంబాలు ఈ కాలనీలో నివాసాలు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి కాలనీ ఇళ్లకు అడ్డుగా ఎక్స్‌వేటర్స్‌తో గోతులు తీశారు. దీంతో కాలనీ వాసులు దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి వీలు లేకుండా పోతుందని కాలనీవాసులు వాపోయారు. అలాగే హౌసింగ్, రెవెన్యూ అధికారులకు దారి సౌకర్యం కల్పించాలని వినతులు అందజేశారు.

డెంగ్యూ మృతిపై విచారణ

ముమ్మరంగా పారిశుధ్య పనులు







సత్యసాయినగర్‌లో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది, గంగమ్మ ఏరులో పూడికతీత, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్

వి.కోట, సెప్టెంబరు19: వి.కోటలో 8వ తరగతి విద్యార్థి మేఘన మృతిపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. వారం రోజుల పాటు జ్వరంతో బాధపడుతూ మంగళవారం బెంగళూరులో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఓగు పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్‌కు తెలిపారు. దీంతో ఈ ప్రాంతంలో ఇంటింటా జ్వరాలపై వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. పారిశుధ్య లోపం వల్ల జ్వరాలు ప్రబలుతున్నట్లు స్థానికులు తెలపడంతో పంచాయతీ వారు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం సత్యసాయి నగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలు, చెత్తా చెదారాన్ని పూర్తిగా తొలగించారు. అలాగే గంగమ్మ ఏరులో మురుగు నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందుతున్నట్లు తెలుసుకున్న అధికారులు తక్షణం ఏరులో పూడితతీతకు చర్యలు చేపట్టారు. హనుమేపల్లె కల్వర్టు వద్ద నుంచి గంగమ్మ ఏరులో ఎక్స్‌వేటర్ సాయంతో పూడికతీతపనులు సర్పంచ్ పీ.ఎన్.లక్ష్మి నేతృత్వంలో ప్రారంభించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మండల పరిషత్ కార్యాయంలో ఆరోగ్య, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖలతో సమీక్ష జరిపారు. గంగమ్మ ఏరు వల్ల ఇబ్బందికర వాతావరణం ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఇరువైపులా పూడికతీత పనులు చేపట్టినట్లు ఆయనకు వివరించారు. అలాగే గంగమ్మ ఏరులో నివాస ప్రాంతం అధికంగా ఉన్న చౌడేపల్లె రోడ్డు నుంచి హనుమేపల్లె వరకు సుమారు రూ.50 లక్షలు వెచ్చిస్తే శాశ్వత పరిష్కారం తీసుకురావచ్చని ఓ నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలను ఎస్ఈ ద్వారా కలెక్టర్‌కు పంపి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రతిపాదనలపై కలెక్టర్‌తో సంప్రదించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ గణేనాయక్, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఏఈ రమేష్, గిరిధర్, ఈవో శివశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇరికిపెంట సమీపంలో ఏనుగుల సంచారం

సోమల, సెప్టెంబరు 19 : సోమల మండలంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి ఏనుగుల మంద ఆవులపల్లె పంచాయతీలోని మల్లేశ్వరం, వంగసానిపల్లె మామిడితోటల్లో స్వైరవిహారం చేసి బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. కపిల సుబ్రహ్మణ్యంకు చెందిన మామిడి కొమ్మలను ధ్వంసం చేసి, డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. వరి నారులో తిరగాడి వెళ్లాయి. అలాగే టమోటా తోటల్లో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి. ఇరికిపెంట సమీపంలో ద్వారకనాథ నాయుడుకు చెందిన ఎకరా వరి పొలం, మామిడి చెట్లు ధ్వంసం కావడంతో రూ. 2లక్షల మేర నష్టం జరిగింది. నెలుకూరివారిపల్లెలో మేకల గంగాధరానికి చెందిన పొలాల్లో పంటలు ధ్వంసం కావడంతో అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పుంగనూరులో పెప్పర్ మోషన్ బస్సుల తయారీ పరిశ్రమ పనులు ప్రారంభించాలి

● సీఎంకు చల్లా రామచంద్రారెడ్డి వినతి

పుంగనూరు, సెప్టెంబరు 19: పుంగనూరులో పెప్పర్ మోషన్ కంపెనీ బస్సుల తయారీ పరిశ్రమ పనులు వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు వినతి చేసినట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విజయవాడ నుంచి వస్తూ ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, అనిత, టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లను కలిసి నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించినట్లు చెప్పారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

అండర్-14 క్రీడాపోటీలు

పలమనేరు, సెప్టెంబరు19 : పలమనేరు బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం అండర్-14 విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, యోగా పోటీలు నిర్వహించారు. బాలుర విభాగం కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గా కొలమాసనపల్లి, రన్నర్స్‌గా దొడ్డిపల్లి, వాలీబాల్‌లో విన్నర్స్‌గా మండిపేటకోటూరు, రన్నర్స్‌గా ఓఎల్ఎల్ యూపీ, జూనియర్ బాలికల విభాగం కబడ్డీలో విన్నర్స్‌గా కొలమాసనపల్లి, రన్నర్స్‌గా దొడ్డిపల్లి, వాలీబాల్‌లో విన్నర్స్‌గా పలమనేరు బాలికల పాఠశాల, రన్నర్స్‌గా ఎం.కోటూరు, జూనియర్ బాలుర విభాగం యోగాలో దొడ్డిపల్లి పాఠశాల విద్యార్థి వరుణ్‌సందేశ్ ప్రథమ స్థానంలోను, పలమనేరు ఉన్నత పాఠశాల విద్యార్థి జగదీష్, మణికంఠ ద్వితీయస్థానంలోను, కొలమాసనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి యశ్వంత్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీలను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, ప్రధానోపాధ్యాయులు షంషీర్‌బాషా ప్రారంభించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారిని మండల జట్టుకు ఎంపిక చేశారు.

అద్దె చెల్లించలేదని మహిళా మార్ట్ సీజ్

పుంగనూరు, సెప్టెంబరు 19: ఏడాదిన్నరగా అద్దె చెల్లించకుండా రూ.12.74లక్షలు బకాయి ఉండటంతో పుంగనూరులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళామార్ట్‌ను గురువారం సాయంత్రం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. అద్దె చెల్లించలేదని మున్సిపల్ ఆర్వో సతీశ్ కమలాకర్, ఆర్ఐ జ్ఞానప్రకాశ్, మున్సిపల్ సిబ్బంది మార్టుకు తాళాలు వేసి మూత వేశారు. కొంతకాలంగా పుంగనూరు సీఎంఎం మధుసూదన్‌రెడ్డి సెలవులో ఉండటంతో విషయాన్ని మెప్మా సీవోలు తిరుపతి పీడీ రాధమ్మ దృష్టికి తీసుకెళ్లగా అద్దె ఇవ్వకుండా పుంగనూరులో మూడు సీఆర్పీ భవనాలు మున్సిపాలిటీ వాడుకుంటోందని చెప్పినా అధికారులు సీజ్ చేశారు. మార్ట్‌లో ఆడిట్ కూడా జరగలేదని, కొన్నింటిలో తేడాలు, అవకతవకలున్నాయని సమాచారం.

హౌసింగ్ అర్జీలే అధికం

కుప్పం, సెప్టెంబరు 19: కుప్పం పురపాలక సంఘంలో అధికారులు, కౌన్సిలర్లు కలిసి నిర్వహిస్తున్న వార్డు ముంగిటికి మున్సిపల్ పాలన కార్యక్రమంలో ప్రజలనుంచి హౌసింగ్‌కు సంబంధించిన అర్జీలే అధికంగా వస్తున్నాయి. పురపాలక సంఘం 11వ వార్డు పరిధిలోని దళవాయికొత్తపల్లె, అర్బన్ కాలనీలలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో హౌసింగ్‌తోపాటు, రేషన్ కార్డులకు సంబంధించి అధికారులకు అర్జీలు అధికంగా అందాయి. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలలో ప్రజలనుంచి అర్జీలను స్వీకరించి, వాటికి రశీదులు ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు జాకిర్, వేలు, ప్రజాప్రతినిధులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామకుప్పం, సెప్టెంబరు 19: కూలి పనుల కోసం కర్ణాటక నుంచి వలస వచ్చిన ఓ వృద్ధుడు రామకుప్పం మండలం గుట్టూరుతాండాలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు ... కోలారు జిల్లాకు చెందిన చంద్రయ్య(62) కొన్ని నెలల క్రితం కూలి పనుల కోసం గుట్టూరుతాండాకు వచ్చాడు. అనారోగ్యంతోపాటు, అతను మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఈ విషయాన్ని అతని బంధువులకు తెలిపారు. గుట్టూరుతాండాకు వచ్చిన అతని బంధువులు, ఈ విషయమై రామకుప్పం పోలీసులకు పిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.